క్లుప్తంగా

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి



ధాన్యం పొల్లు శాతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శెట్టి, వ్యవసాయాధికారి ప్రభాకర్ తదితరులు

రాయవరం: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని నిబంధనలకు అనుగుణంగా తీసుకుంటున్నారా అనే విషయాన్ని శనివారం తహసీల్దార్ ఐ.పి. శెట్టి, మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ పరిశీలించారు. మండలంలోని సోమేశ్వరం శ్రీలక్ష్మి గణపతి రైస్ మిల్లుల్లో ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సీఎంఆర్ ద్వారా రా రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని అధికారులు పరిశీలించారు.

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



సోమేశ్వరంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎంఈవో తదితరులు

రాయవరం: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో–2 వై.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సోమేశ్వరంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూరుశాతం అక్షరాస్యత సాధిస్తేనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం గ్రామంలో ఎంఈవో, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యటించి బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలున్నాయ్.. జాగ్రత్త

రామచంద్రపురం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి ఈశాన్యంగా రహదారిపై ఉన్న చెత్త మొత్తం రెండు రోజులుగా తొలగించడం జరిగిందని ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారపుపేట రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుకు ఇకపై చెత్త తరలించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు ఇక్కడ చెత్త వేయడం అలవాటు అయిన వారు ఇకపై మానుకోవాలని కైలాస భూమికి పక్కనే ఉన్న ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న కారణంగా ఇక్కడ సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా ఇక్కడ చెత్త వేస్తే గుర్తించి వారి వాహనాలు సీజ్ చేయడం, జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు

రామచంద్రపురం రూరల్: తొమ్మిదో తరగతి చదువుకుంటున్న బాలికను వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ శనివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జగన్నాయకులపాలేనికి చెందిన గుండవరపు తమ్మిరాజు మైనర్ బాలికపై తన కోరిక తీర్చమని అసభ్యంగా ప్రవర్తిస్తూ బాలికకు ప్రైవేటు పార్టు చూపించడం వంటి వికృత చర్యలకు పాల్పడుతున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

పట్టణంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర



మండపేట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో మండపేట మున్సిపాలిటీ ఎల్లప్పుడూ కూడా తలమానికంగా ఉంటుందన్నారు. అలాగే మండలంలోని ఏడిద జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకట్రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఆక్రమణలపై గరంగరం

- సత్యశ్రీ రోడ్డులో వాటర్ వర్క్స స్థలం కబ్జాపై ఎమ్మెల్సీ తోట మండిపాటు
- గతంలో ఆక్రమణలు తొలగించామని వెల్లడి
- అధికారుల తీరుపై ఆగ్రహం
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చిత్రంలో ఎమ్మెల్యే వేగుళ్ల



సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: స్థానిక సప్తగిరి థియేటర్ ఎదురుగా ఉన్న పాత రైస్‌మిల్లు యాజమాన్యం పక్కనే ఉన్న మున్సిపల్ వాటర్ వర్క్స స్థలాన్ని కబ్జాచేసి ప్రహరీ నిర్మిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వాటర్ వర్క్స స్థలాన్ని మిల్లు యాజమాన్యం ఆక్రమించినట్టు అందిన ఫిర్యాదులతో సర్వే చేయించగా వాస్తవమని తేలిందన్నారు. అప్పట్లో ఆక్రమణలు తొలగించి మున్సిపల్ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఎమ్మెల్సీ తోట గుర్తు చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత ఇప్పుడు అదే స్థలాన్ని మిల్లు యాజమాన్యం మళ్లీ ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అంగుళం సొంత స్థలం వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడరని, అటువంటిది ఎంతో విలువైన మున్సిపల్ స్థలం అన్యాక్రాంతమవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని కమిషనర్ రంగారావును ప్రశ్నించారు. ఈ ఆక్రమణ అంశం ఎమ్మెల్యే వేగుళ్ల దృష్టికి వెళ్లి ఉండకపోవచ్చని, తప్పు జరుగుతుంటే ఆయన చూస్తూ ఊరుకోరని తాను భావిస్తున్నానని ఎమ్మెల్సీ తోట అన్నారు. దీనిపై టీపీవో మాట్లాడుతూ ఆక్రమణలు ఏమీ లేవని చెప్పే ప్రయత్నం చేయగా ఎమ్మెల్యే వేగుళ్ల కలుగజేసుకుని మీరు కొత్తగా వచ్చారని, సభ్యులకు వివరణ ఇవ్వాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల కోరారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సర్వే చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

సౌరశక్తితో విద్యుత్‌ను అందించేందుకు కేంద్రం తెచ్చిన సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ పథకం ద్వారా కేంద్రం అందించే సబ్సిడీ వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల అధికారులకు సూచించారు. తొలుత మున్సిపల్ వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్యబాబు, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, చంద్రు సుబ్బారావు చౌదరి, కొవ్వాడ బేబీలతో ఏర్పాటు చేసిన పారిశుధ్య ప్యానెల్ కమిటీకి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే ఏడుగురు సభ్యులతో కాంట్రాక్టు కమిటీ నియామకానికి సంబంధించిన అంశాన్ని వచ్చే కౌన్సిల్‌లో చర్చించాలని నిర్ణయించారు. పట్టణంలోని వివిధ సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల చర్చించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. టిడ్కో గృహాల్లో సైకిల్ షెడ్డు నిర్మాణం జరపాలని ఎమ్మెల్యే సూచించారు. వర్కు టెండర్లు దక్కించుకుని పనులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల లిస్టు తయారు చేసి వారిని బ్లాక్ లిస్టులో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మద్యం షాపు తొలగించాలి

మున్సిపల్ కార్యాలయం పక్కన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఎమ్మెల్సీ తోట అధికారులకు సూచించారు. వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చే మహిళలు మద్యం దుకాణం వలన తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తోందన్నారు. షాపు తరలించే అంశాన్ని రానున్న కౌన్సిల్ దృష్టికి తేవాలని గత సమావేశంలో అధికారులకు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట గుర్తు చేశారు. అయినప్పటికీ అజెండాలో ఎందుకు పెట్టలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇప్పటికైనా మించిపోయింది లేదని, టేబుల్ అంశంగా తీసుకురావాలని సూచించగా ఎమ్మెల్యే వేగుళ్ల స్పందిస్తూ అప్పటికప్పుడు టేబుల్ అంశంగా తెచ్చేందుకు అవకాశం ఉంటుందా అని కమిషనర్‌ను ప్రశ్నించారు. అందుకు వీలుపడదని కమిషనర్ తెలిపారు. దీనిపై కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) స్పందిస్తూ 2019లో జరిగిన మున్సిపల్ సమావేశంలో సీతారామ కమ్యూనిటీ హాలు వివాదాన్ని టేబుల్ అంశంగా తెచ్చామని, సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల కూడా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ విషయం తనకు గుర్తు లేదని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు.

ఎమ్మెల్సీ తోటకు సత్కారం



తోటకు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిల్ సభ్యులు

మండపేట: వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును వైఎస్సార్ కౌన్సిల్ బృందం సన్మానించింది. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం అనంతరం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్వర్యంలో కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), 24 వ వార్డు కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి, 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ దుశ్శాలువా, పూలమాలతో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ తోట త్రిమూర్తులు సలహాలు, సూచనలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. వైఎస్ చైర్మన్ వేగుళ్ల నారాయణరావు, కౌన్సిలర్లు ఎర్నేని ప్రభావతి, ముక్కా మేరీ స్వరూపారాణి, ముక్కా లోవలక్ష్మి, సంతస శాంతకుమారి, పోతంశెట్టి ప్రసాద్, మారిశెట్టి సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, మెండు బాపిరాజు, పార్టీ ఐటీ, సోషల్ మీడియా విభాగాల అధ్యక్షులు యరమాటి వెంకన్నబాబు, జొన్నపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

జోరుగా సేవా కార్యక్రమాలు



మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

మండపేట: అర్తమూరులో ఎస్బీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి హోమియో శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో ఆసుపత్రి వైద్యులు 250 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత గ్రామంలో ఉచిత కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. మహిళలకు కుట్టు మెషీన్లు అందించారు. వేసవిలో బాటసారులకు, ప్రజలు రక్షిత మంచి నీటిని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళా విభాగం చైర్మన్ సత్తి శ్రీదేవి, లక్ష్మణరెడ్డి భార్య అపరంజిలు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 9 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లను వితరణ చేశారు. శిక్షణ పొందిన 36 మంది మహిళలకు బహుమతులు అందించారు. పలువురికి చీరలు పంపిణీ చేశారు. సత్తి బులిస్వామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వీర్రాఘవరెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



శలపాక అంబేడ్కర్ మందిర వద్ద స్థానికులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను ప్రారంభిస్తున్న ఎస్సై

కాజులూరు: గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో స్థానికులు విడివిడిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా చాలా వరకూ నేరాలను అదుపు చేయవచ్చని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. శలపాక అంబేడ్కర్ మందిరం వద్ద స్థానికులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను శనివారం ఎస్సై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు గ్రామాల్లోని అంబేడ్కర్ మందిరాలు, పలు ఆలయాలు, వ్యాపారసంస్థల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. తమ సూచనలు గౌరవిస్తూ శలపాక అంబేడ్కర్ మందిరం వద్ద సీసీ కెమెరాను ఏర్పాటు చేసిన స్థానిక యువజన సంఘ సభ్యులకు, గ్రామ పెద్దలకు అభినందనలు తెలిపారు.

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

రాయవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన ఆధ్వర్యంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అధికారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతల కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఐసీడీఎస్ పీవో గజలక్ష్మి వివరించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఐపీ శెట్టి సూచించారు. సూర్యఘర్ యోజన ద్వారా అందిస్తున్న రాయితీలను ఏఈఎస్. శ్రీనివాసులు వివరించారు. గ్రామాల్లో సమస్యలను ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాలేదు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా సమావేశానికి హాజరైన చింతపల్లి రామకృష్ణను, ఈవోపీఆర్డీ పేరును ప్రభుత్వం డిప్యూటీ ఎంపీడీవోగా మార్చడంతో ఈవోపీఆర్డీగా ఉన్న ఎస్.శ్రీనివాసరావును అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, వైఎస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎర్రపోతవరం నీటి వినియోగదార్ల సంఘం ఉపాధ్యక్షుడు కొరిపిల్ల శ్రీనివాసరావు, ఎంఈవో వై.సూర్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



పామర్రు మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల నృత్యాలు

కె.గంగవరం: మండలంలోని పామర్రు శెట్టిబలిజపేటలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ అలజంగి నాగరాజు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి చేస్తున్న కృషిని అభినందించారు. వార్షికోత్సవం నిర్వహణతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం వెల్లివిరుస్తుందన్నారు. వార్షికోత్సవానికి హాజరైన తల్లిదండ్రుల నుంచి ఒకటో తరగతిలో నూతన అడ్మిషన్లు రావడం శుభ పరిణామమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పామర్రు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఓవీ రమణ, పామర్రు నెంబర్–2 పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని జాతీయం చేయాలి

రామచంద్రపురం: పేద వర్గాల నాయకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి స్ఫూర్తితో విద్యా రంగాన్ని జాతీయకరణ చేయాలని, శాస్త్రీయ విద్య సాధనకై పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పిలుపు నిచ్చారు. స్థానిక పిల్లా వారి మున్సిపల్ హైస్కూల్‌లో జార్జిరెడ్డి సభను శనివారం నిర్వహించారు. ముందుగా జార్జిరెడ్డి చిత్రపటానికి హెచ్ఎం సత్యనారాయణ, శ్రీరామ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు, రామకృష్ణ, బి.సిద్ధూ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి.సిద్ధూ మాట్లాడుతూ జార్జిరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో చేరేటప్పటికి యూనివర్సిటీలో మహిళలపై ర్యాగింగ్, వెనుకబడినటువంటి వర్గాల విద్యార్థులపై దాడులు జరిగేవని వాటిని ఎదిరించి పోరాడటంలో జార్జిరెడ్డి ముందు వరసలో నిలుచున్నాడన్నారు. ఆయన ఎదుగుదలను ఓర్వలేక కొందరు 1972 ఏప్రిల్ 14న పథకం ప్రకారం కత్తులతో పొడిచి హత్య చేశారన్నారు. ఆయన మరణించినప్పటికీ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నేటి వరకు దేశంలో విద్యారంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కరుపోతు నవీన్ కుమార్, ఐఎంఎస్ సాయికుమార్, ఎ.సాయి సంతోష్, ఎస్‌కే హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ



గొల్లపాలెంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



మండపేటలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



అంగరలో మాట్లాడుతున్న ఫెలోషిప్ అధ్యక్షుడు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాల్లో శనివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే కార్యక్రమాల్లో భాగంగా గొల్లపాలెం శలపాక జంక్షన్ నుంచి కాకినాడ, కోటిపల్లి రహదారిపై క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. పలువురు చర్చి పాస్టర్లు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి ప్రభువు ఏసు అందించిన నిర్దేశకాలను ప్రసంగించారు. గొల్లపాలెం తిరుమల ఫంక్షన్ హాల్ అధినేత, దుబాయ్‌లో ఉంటున్న ప్రవాస భారతీయుడు దేగల నాగేంద్ర క్రైస్తవ భక్తులకు అల్పాహారం, వసతులు సమకూర్చారు. మండల పరిసర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

మండపేట: పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు బిషప్ డాక్టర్ డేనియల్ పాల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఉదయ భాస్కర్ చర్చి నుంచి కలువపువ్వు సెంటర్, పెద్ద కాలువ వరకూ ర్యాలీ సాగింది. క్రైస్తవులు సంకీర్తలు పాడుతూ శిలువ సందేశాన్ని తెలియపరిచారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల చర్చి పాస్టర్లు, సంఘ కాపరులు, సేవకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: లోకంలోని సమస్త ప్రజల పాప భారాన్ని మోయడానికి సిలువపై బలియాగమైన క్రీస్తు ఇచ్చిన సత్య సందేశం మానవాళికి మార్గదర్శకమని మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు రూబెన్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఏసు పునరుత్థాన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో పడమర ఖండ్రిక నుంచి అంగర మీదుగా కపిలేశ్వరపురంలోని మండల పాస్టర్స్ ఫెల్లోషిప్ కమ్యూనిటీ భవనం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు, కార్యదర్శి కిరణ్‌పాల్, కోశాధికారి ఇమ్మానుయేల్, చీఫ్ పేట్రన్ నానిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



కపిలేశ్వరపురంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న హనుమంతరావు



వెల్ల పీహెచ్‌సీ ఆవరణలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

కపిలేశ్వరపురం: అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని మండపేట అగ్నిమాపక దళం అధికారి జె.హనుమంతరావు అన్నారు. కపిలేశ్వరపురంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదం సంభవించినప్పుడు నివాసితులు స్పందించాల్సిన తీరును హనుమంతరావు ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రమాదవశాత్తూ మంట చెలరేగే పరిస్థితులు, వాటిని ఆర్పే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆసుపత్రుల భవనంలోని పై అంతస్తులో ప్రమాదాలు జరిగినప్పుడు చేయాల్సిన ఏర్పాట్లుపై సిబ్బందికి వివరించారు. అగ్నిమాపక సిబ్బంది వి.సుబ్రహ్మణ్యం, ఎం.వెంకట్రావు, ఎ.ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, జీజీఎం రాజు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల పీహెచ్‌సీ వద్ద రామచంద్రపురం విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అగ్ని ప్రమాదాల నివారణా చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ ఎస్.నాగేశ్వరరావు పర్యవేక్షణలో లీడింగ్ ఫైర్ మేన్ ఐవీ సుబ్రహ్మణ్యం, ఫైర్‌మేన్‌లు చీకట్ల వీరబాబు, జి.మహేష్, ఏవీవీ మూర్తిలు అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, నివారించడానికి పాటించాల్సిన విధానాలు, ప్రమాదం సంభవించినప్పడు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో కచ్చితంగా రెండు అగ్నిమాపక యంత్రాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీవీ లక్ష్మీప్రసన్న దుస్తులకు నిప్పు అంటుకున్నప్పుడు పరిగెత్తకుండా నేలపై దొర్లి దుప్పటి చుట్టాలన్నారు. కాలిన శరీర భాగాలపై చల్లని నీటిని పోయాలని సూచించారు. మరో వైద్యాధికారి అలేఖ్య మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించినప్పుడు పొగ నిండిన గదుల నుంచి మోకాళ్లపై నడచి బయటపడాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, రత్నం, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పౌష్టికాహారమే తల్లీబిడ్డలకు శ్రీరామరక్ష



నిడసనమెట్టలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కపిలేశ్వరపురం: పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలే తల్లీబిడ్డలకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి అన్నారు. మండపేట ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో శనివారం నిడసనమెట్ట, మాచర గ్రామాల్లో పోషణ్ పక్వాడ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెర్రిపోతు హల్‌చల్

అంబాజీపేట: స్థానిక పి.గన్నవరం రోడ్డులో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ షాపులో జెర్రిపోతు హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నిట్టాల రామ సుబ్రహ్మణ్యం షాపులోకి జెర్రిపోతు ప్రవేశించి హల్‌చల్ చేయడంతో షాపు యజమానితో పాటు పక్కన ఉన్న షాపుల వారు భయాందోళనకు గురై భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. దాంతో వర్మ జెర్రిపోతును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించారు. జన సంచారం లేని ప్రాంతంలో ఆ పామును వదిలిపెట్టారు.